# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## పశ్చిమ యూనిఫైడ్ కమాండ్

## పత్రికా ప్రకటన

## ప్రజా గెరిల్లా యుద్ధంతో తలపడకండి!

## ప్రజల్లో ఒకరుగా బతకండి!

**పోలీసులారా! సి-60 కమాండోలారా!**

మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లా విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ప్రభుత్వం సి-60(క్రాక్ కమాండో) ఏర్పర్చి 2015 మే నాటికి 25 సంవత్సరాలు నిండుతున్నాయి. ఈ ఇరవై అయిదు సంవత్సరాలలో మీరు ఎంతమంది విప్లవకారులను, విప్లవ ప్రజలను పొట్టన పెట్టుకున్నారో ఆలోచించండి. ప్రభుత్వం ఒక్కొక్క సి-60 కమాండోపై 75 లక్షల రూపాయిలను వెచ్చిస్తూ మిమ్మల్ని పాశవికమైన కమాండోలుగా తయారు చేయడానికి ఎందుకు పూనుకుందో ఎప్పుడైనా ఆలోచించారా! గడ్‌చిరోలి జిల్లాలో గత 35 ఏండ్లుగా విప్లవోద్యమం ఫలితంగా మీ కుటుంబాల ఆర్థిక స్థితి, జీవన పరిస్థితులు ఎంత మెరుగ్గా మారాయో మీకు తెలువనిది ఏ మాత్రం కాదు. ఈ 35 ఏండ్ల విప్లవోద్యమం మీ తరాన్ని తలెత్తుకొని ఆత్మ గౌరవంతో జీవించేలా చేసిందనడం ఎంత మాత్రం అతిశయోక్తి కానేకాదని మీకు మేం గుర్తు చేయాల్సిన అవసరం లేనే లేదు. ఉద్యమం మొదలయ్యాక పదేళ్లు నిండకముందే మీ సి-60ను దోపిడీ పాలక వర్గాలు తయారు చేయపూనుకున్నాయి. విప్లవోద్యమాన్ని నిర్మూలించే కర్తవ్యాన్ని మీకు అప్పగించారు. కానీ ఆచరణలో జరిగిందేమిటి? ప్రజా గెరిల్లా యుద్ధాన్ని విదర్భలోని పలు జిల్లాలకు విస్తరించకుండా మీరు అడ్డుకోలేకపోయారనీ చరిత్ర నిరూపిస్తోంది. విప్లవోద్యమ ప్రభావం మహారాష్ట్ర రాజధాని ముంబాయి సహా మూల మూలలకు విస్తరించడాన్ని కాదనగలరా! విప్లవకారుల, విప్లవ ప్రజల అసమాన త్యాగాలతోనే మా పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం మహారాష్ట్రే కాదు, దేశంలోని అనేక రాష్ట్రాలకు విస్తరించింది. ఎన్నో జిల్లాలలో విప్లవ కార్యక్రమాలలో ప్రజలు కదులుతున్నారు. దేశంలోని విశాల భూభాగం రెడ్ కారిడార్ లేదా మావోయిస్టు కారిడార్‌గా వార్తలకెక్కడం మీకు తెల్సిందే! దేశ దోపిడీ పాలక వర్గాలు మా పార్టీని అంతర్గత భద్రతకు పెను ముప్పుగా ప్రకటించడం మిమ్మల్ని బూటకపు దేశభక్తితో రెచ్చగొట్టడానికి కాకపోతే మరెందుకు? మీరూ ఆలోచించండి! మీరు ప్రజల పక్షం నిలవండి. గడ్‌చిరోలి, గోందియా జిల్లాలను పోలీసులతో నింపేస్తున్నారు. కొత్త కొత్త క్యాంపులను ఏర్పరుస్తూ పెద్ద ఎత్తున బలగాలను మోహరిస్తున్నారు. మరింత రక్తపాతానికి పూర్తిగా సిద్ధమవుతున్నారు. ఇదంతా ఆదివాసీల ప్రకృతి సంపదలను కొల్లగొట్టడానికే! దీన్ని మీరు మరోసారి సరిగ్గా అర్థం చేసుకోండి.

కమాండోలారా!

గడ్‌చిరోలి జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యల గురించి మీరు ఒక్క క్షణం ఆలోచించండి.

జల్-జంగల్-జమీన్ నినాదాన్ని పెసా చట్టం ఎత్తిపడుతోంది. గ్రామ సభలకే సర్వాధికారాలు అని చట్టం ఘోషిస్తోంది. చట్టాన్ని నమ్ముకున్న ఆదివాసీలు మాకు గ్రామసభలు కావాలంటుంటే ఆ చట్టం చేసిన ప్రభుత్వమే ఎందుకు అనేక తిరకాసులు పెడుతోందో అడగండి. ఏవేవో జిఆర్‌లు జారీ చేసి అసలు చట్టానికి తూట్లు పొడుస్తోంది. పెసా చట్టం ప్రకారం ఈ అడవి మాదేనంటూ ఆదివాసీ స్త్రీ-పురుషులు వేల సంఖ్యలో నెల కింద ఏటపల్లి తాలూకా కేంద్రంలో ప్రదర్శన జరిపారు. కానీ 2007 నూతన అటవీ చట్టం ఆదివాసీలను నిస్తార్ కూపులకే పరిమితం చేయడాన్ని మీరూ ప్రశ్నించండి. అంతేకాదు, తాజాగా పార్లమెంటులో గనుల చట్టం ఆమోదం పొందిన విషయం మీ దృష్టికి వచ్చిందా! ఆ చట్టం ప్రకారం గడ్‌చిరోలి జిల్లాలో వేలాది హెక్టార్ల అటవీ భూములు, రైతుల పంట పొలాలు నాశనం కానున్నాయి. వందలాది మీ సోదర ఆదివాసీ కుటుంబీకులు అడవి తల్లి ఒడిని వదలి ఏ పట్టణాల ఫుట్‌పాత్‌లపైనో బిచ్చమెత్తుకునే స్థితి దాపురించనుంది. బైలడిల్లాలో లాగా మీ తోబుట్టువులు వేశ్య గృహాల్లో దేహ వ్యాపారానికి ఎందరు బలికానున్నారో చూడాల్సిందే. మేం ఈ జిల్లాలో సెంటు భూమి కూడా వదిలేది లేదని ఆదివాసీ రైతాంగం తెగించి నిలబడితే మీరు ఏం చేస్తారు? మీ తుపాకులు ఎవరి పక్షం వహిస్తాయి? మేక్-ఇన్-ఇండియా అంటోన్న మోదీ, ఆయన అనుంగు సహచరుడు దేవేంద్ర ఫడ్నవీస్ అంటోన్న మేక్-ఇన్-విదర్భ లక్ష్యాలను మీ తుపాకులు పరిపూర్తి చేస్తాయా? లేదంటే మీరు ప్రజల్లో ఒకరిగా జీవిస్తూ మీ ఆదివాసీ ప్రజల అస్థిత్వం కోసం పోరాడుతారా! మీరే నిర్ణయించుకోవలసిన సమయం ఇది!

కేంద్రంలో కాషాయ బ్రిగేడ్ అధికారం అందుకున్నాక ఆదివాసీలతో సహా పదుల కొద్ది అల్పసంఖ్యాక మతాల ప్రజల జీవితాలు భగ్గుమంటున్నాయి. ఘర్ వాపసీ పేరుతో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టులు మతోన్మాద హోమం మండిస్తున్నారు. హత్యలు, అత్యాచారాలు, లోబర్చుకోవడాలతో కాషాయ దుండగులు అనేక ఘోరాలకు తలపడుతున్నారు. చర్చిలను తగులబెడుతున్నారు. రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. తలపండిన మహిళలను సైతం అత్యాచారాలకు బలిచేస్తున్నారు. దళితులపై ఊచకోత ఆగడమే లేదు. వీటిని మీరు తెలుసుకోండి. వీటిని ప్రశ్నించండి. దోపిడీ వర్గాల సేవలో

జీతపురాళ్లకోసం బతకడం పరమ నీచమైనదిగా గుర్తించండి. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కు ఏ మంటల్లో కలిపారో నిలదీయండి!

దేశంలోని మరికొన్ని రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలో గోహత్యా నిషేధం ప్రకటించిన విషయం మీకు ఈ పాటికి తెలిసే ఉంటుంది. కర్సడ్‌లలో, బండ పాతడంలో గొడ్డు మాంసంతో వేడుక చేసే ఆదివాసీ సంప్రదాయాలు కాషాయ బ్రిగేడ్‌కు ఏం తెలుసు? మరే మాంసం లేకున్నా ఆదివాసీలకు, దళితులకు, పేద బడుగు వర్గాలకు శ్రామిక కులాలకు గొడ్డు మాంసం లేకుండా ఎలా గడుస్తుందో, వారికి పోషక పదార్థాలు ఎలా సమకూరుతాయో చుక్కలంటే ధరలు పెంచుతోన్న ప్రభుత్వాలను నిలదీయండి. గొడ్డు తినేవాళ్లు గోండులంటూ ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కించ పరచడాన్ని గట్టిగా ఎదుర్కొండి. నిజానికి గోహత్యా నిషేధం అంటే ఈ దేశంలో తరతరాలుగా సాగుతున్న చాతుర్వర్ణ వ్యవస్థను భద్రంగా నిలపడం తప్ప మరేం కాదు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థపై సవర్ణుల ఆధిపత్యాన్ని కొనసాగించడం తప్ప ఇంకేం కాదు. ఆదివాసీలను, దళితులను, శ్రమైక జీవులను సాటి మనుషులుగా గుర్తించలేని దుష్ట బ్రాహ్మణిక కుల వ్యవస్థను నామరూపాలు లేకుండా చేయ పోరాడడానికి కృత నిశ్చయులు కండి!

దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో ఎన్నెన్నో సమస్యలతో ప్రజలు అట్టుడికిపోతున్నారు. మీరు ఫడ్నవీస్, మోదీ, మోహన్ భాగవత్, రాజనాథ్ సింగ్‌ల మోసపు మాటలు నమ్మకండి. రవీంద్ర కదం, సువేజ్‌హక్ లాంటి మీ ఉన్నతాధికారులు మీలో ఏ మాత్రం ఆత్మగౌరవం లేకుండా మిమ్మల్ని ఎంత నీచంగా చూస్తున్నారో గుర్తు చేసుకోండి. 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన ముర్మురీ మాటు దాడిలో మీ సోదర కమాండోలు ప్రాణాలు కోల్పోతే మీ ఎస్‌పి హక్ మిమ్మల్ని ఎన్ని బండబూతులు తిట్టాడో గుర్తుచేసుకోండి.

దేశంలో లక్షలాది ఆదివాసీలు తమ భూముల కోసం, తమ అడవుల కోసం, తమ ప్రకృతి సంపదల కోసం, తమ ఆత్మ గౌరవం కోసం తెగించి పోరాడుతున్నారు. దేశంలో ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా తొలి తూటా పేల్చిన వీరులు ఆదివాసీలేనన్న చారిత్రక సత్యాన్ని మర్చిపోకండి.  జిల్లాలో పని చేస్తోన్న అనేక ఎన్‌జిఒలు (సురేష్ బార్సాగడే, అజయ్ దోడ్కె లాంటి వాళ్లు) ప్రజల పోరాట చేవను నీరుగారుస్తున్నాయి. ప్రజలను సంస్కరణ ఊబిలో పాతరేయడానికి చూస్తున్నాయి. మీరు వాస్తవాలను గ్రహించండి. సోదర ఆదివాసీల పక్షం నిలవండి. ప్రజా గెరిల్లా యుద్ధంలో భాగంగా పిఎల్‌జిఎ కొనసాగిస్తున్న దాడులలో కమాండోలుగా మీరు చావడం కన్నా ప్రజల్లో ఒకరుగా బతకడానికి సిద్ధం కండి! ప్రజల మధ్య మీ తప్పులు అంగీకరించండి. ప్రజలు క్షమిస్తారు. నిన్నటి హత్తిగోట, లాహెరి, మర్కనార్, ముర్మురీలు నేటి టేకమెట్టలలో మీరు ఎవరి కోసం మీ ప్రాణాలను బలిపెట్టారో గుర్తించండి. మీరూ పేదలే! మీరూ ఆదివాసీలే! మీకు పోలీసు, ఫారెస్టు విభాగాల్లో ఉద్యోగం తప్ప మరేవి ఇవ్వని ప్రభుత్వంతో 'జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార్' కోసం పోరాడ సిద్ధం కండి.

మేం విప్లవకారులం. మాది వర్గ పోరాటం. మేం పీడిత వర్గాల కోసం పోరాడుతున్నాం. మాకు త్యాగాలు కొత్త కాదు. మేం చిరునవ్వులతో ప్రాణాలను త్యాగం చేస్తాం. ఒక గుండాదుర్, ఒక సద్మెక్ బాబురావు, ఒక భగత్‌సింగ్, ఒక పెద్ది శంకర్, ఒక జూరు వడ్డె, ఒక రనీత, దన్ని, గీత, రీత, సరిత, శారద, రంజు, మందా, పున్ని, శ్యామ్‌కో, స్వరూప, సంతీల, ఒక మైనాబాయి ఎందరెందరో ప్రజా వీరులు. చరిత్ర వారిని స్మరిస్తుంది. వారి త్యాగాలను ప్రపంచ పీడితులు గుర్తు చేసుకుంటూ ప్రేరణగా తీసుకుంటున్నారు. అదే సరైంది. దానితో తలపడకండి.

**సెక్రటరీ**

**(శ్రీనివాస్)**

**పశ్చిమ రీజనల్ కమిటీ**

**గడ్‌చిరోలి-గోందియా**

**దండకారణ్యం**

భగత్ సింగ్ 84వ వర్ధంతి

23 మార్చి 2015